


ఆత్మకూరులో శ్రీరాముడు, ఆంజనేయస్వామి

- ఆలయాల్లో పండుగ వాతావరణం
- బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పూజలు
- అయోధ్య ఘట్టాన్ని వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు

అంతటా రామనామం

నంద్యాల (కల్చరల్), జనవరి 22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నంద్యాల పట్టణంలోని పలు ఆలయాలలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ప్రతిష్ఠా కార్యక్రమాలను తిలకించేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అమ్మవారిశాల, బాలాజీ కాంప్లెక్స్ కళ్యాణ మండపం, కల్పన సెంటర్ కోదండ రామాలయం, శ్రీకృష్ణమందిరంలో, ప్రథమ నందీశ్వరాలయంలో భక్తుల కోసం ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. అర్చకులు రాముని విశిష్ట గురించి వివరించారు. అన్ని ఆలయాలలో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో వందల ఏళ్ల కల సాకారమైందని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీరామ, జయరామ, జయజయ రామా అంటూ భక్తులు శ్రీరామ జపం చేశారు. ఆలయాల్లో పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. సాయంత్రం రాముడి చిత్రపటాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

జిల్లాలోని ఆలయాలు కాషాయమయమయ్యాయి. భక్తుల రామనామ స్మరణతో మార్మోగాయి. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణం నెలకొంది. పలు పట్టణాల్లో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భజన బృందాల మధ్య సీతారాముల శోభాయాత్ర వైభవంగా సాగింది. కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రీరాముని పట్టాభిషేకం చేశారు. మహానంది క్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను తిలకించేందుకు పలు పట్టణాల్లో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. శ్రీశైలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడు, సీత, హనుమంతుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి.



ఆత్మకూరు కాషాయమయం...

ఆత్మకూరు: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ క్రతువును పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలో సోమవారం సీతారాముల శోభాయాత్ర వైభవంగా సాగింది. ముందుగా అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉత్సవమూర్తులను అలంకరించి రథంలో కొలువుదీర్చారు. అనంతరం అశేష భక్తజనం నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతోనే అయోధ్య రామమందిరం నిర్మాణం సాధ్యమైందని బీజేపీ మైనార్టీ మహిళా మోర్చా జాతీయ సభ్యులు మోమిన్ షబానా పేర్కొన్నారు.



ఆత్మకూరులో భక్తుల ర్యాలీ



నంద్యాలలో అన్నదానం

మహానందిలో సీతారాముల కల్యాణం

మహానంది: అయోధ్యలోని రామ జన్మభూమిలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అదే ముహూర్తంలో మహానంది క్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. అంతకుముందు మహానందిలో వందలాదిగా హిందువులు తరలివచ్చి జైశ్రీరామ్ అంటూ ర్యాలీ నిర్వహించారు. అయోధ్యలో కరసేవలో పాల్గొన్న గ్రామానికి చెందిన బచ్చెటి వెంకట శివయ్య, భూమా స్వామిగుప్త, భూమా గోపాల్, శివరామిరెడ్డిలను మహానంది దేవస్థానం ఈఓ కాప చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ సత్కరించారు.



మహానందిలో భక్తుల ర్యాలీ



చాగలమర్రిలో బైకు ర్యాలీ



బేతంచెర్లలో శ్రీరాముని శోభా యాత్ర





రుద్రవరంలో గ్రామోత్సవం





నంద్యాల పట్టణంలో శ్రీరామునికి పూజలు



ఉయ్యాలవాడలో గ్రామోత్సవం

ఓటరు తుది జాబితా విడుదల

- జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- జిల్లా ఓటర్ల సంఖ్య 13,72,091
- గత ఏడాది కంటే పెరిగిన ఓటర్ల సంఖ్య 20,971



నంద్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సాధారణ ఎన్నికలకు దాదాపు మూడు నెలల సమయం ఉంది. ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునే ఓటర్ల తుది జాబితాను అధికార యంత్రాంగం సోమవారం విడుదల చేసింది. జిల్లాలోని పాణ్యం అసెంబ్లీ మినహా మిగతా 6 నియోజకవర్గాల ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 13,72,091 మంది ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 6,73,425 మంది, మహిళా ఓటర్లు 6,98,404 మంది ఉండగా, ఇతరులు 262 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో వెలువరించిన జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 13,51,120 ఓటర్లున్నట్లు ప్రకటించారు. ఈ లెక్కన గతంతో పోల్చుకుంటే 20,971 మంది ఓటర్లు పెరిగినట్లయింది. నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువగా పెరగగా, శ్రీశైలం, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది అక్టోబరులో వెలువరించిన తుది జాబితా డ్రాఫ్ట్ ప్రకారం ఓటర్ల సంఖ్యలో పెరుగుదల భారీగానే ఉంది. దాని ప్రకారం జిల్లాలో 13,57,998 మంది ఓటర్లు ఉన్నారు. ఈ లెక్కన అప్పటికి కొత్త ఓటర్ల సంఖ్య 6,878 మాత్రమే పెరిగింది. కానీ తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం ఆ సంఖ్యలోనే తేడా 20,971 ఉంది. అంటే.. డ్రాఫ్ట్ వెలువరించినప్పటి నుంచి తుది జాబితా విడుదల వరకు మధ్యలో మరో 14,093 మంది ఓటర్లు కొత్త జాబితాలో చేరారు.



- ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 114311 మంది, మహిళలు 116589 మంది, థర్డ్ జండర్లు 14 మంది ఉన్నారు. తుది జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 230914. 2023 జనవరిలో ప్రకటించిన జాబితాలో 226104 మంది ఓటర్లు ఉన్నారు. గతంతో పోల్చుకుంటే 4810 మంది ఓటర్లు పెరిగారు.
- శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 94910 మంది, మహిళలు 99009 మంది, థర్డ్ జండర్లు 43 మంది ఉన్నారు. తుది జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 193962. . 2023 జనవరిలో ప్రకటించిన జాబితాలో 193219 మంది ఓటర్లు ఉన్నారు. గతంతో పోల్చుకుంటే 743 మంది ఓటర్లు పెరిగారు.
- నందికొట్కూరు (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 10,6215 మంది, మహిళలు 1,10,417 మంది, థర్డ్ జండర్లు 17 మంది ఉన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 216559. 2023 జనవరిలో ప్రకటించిన జాబితాలో 2,10,669 మంది ఓటర్లు ఉన్నారు. గతంతో పోల్చుకుంటే పెరిగిన ఓటర్ల సంఖ్య 5,890.
- నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 1,30,278 మంది, మహిళలు 1,37,273 మంది, థర్డ్ జండర్లు 94 మంది ఉన్నారు. తుది జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 2,67,645 మంది ఉన్నారు. గత ఏడాది జనవరి జాబితా ప్రకారం నంద్యాల నియోజకవర్గంలో 7947 మంది ఓటర్లు పెరిగారు.
- బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 1,17,344 మంది, మహిళలు 1,21,531 మంది, థర్డ్ జండర్లు 25 మంది ఉన్నారు. తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,38,900 మంది ఉన్నారు. గతేడాది జాబితా ప్రకారం ఇక్కడ 175 మంది ఓటర్లు తగ్గారు.
- డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషులు 1,10,457 మంది, మహిళలు 1,13,585 మంది, థర్డ్ జండర్లు 69 మంది ఉన్నారు. ఇక్కడ మొత్తం ఓటర్లు 2,24,111 ఉన్నారు. గతేడాది ఓటరు జాబితాకు, ప్రస్తుత జాబితాకు నియోజకవర్గంలో 1,756 మంది ఓటర్లు పెరిగారు.
- జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 295, శ్రీశైలంలో 226, నందికొట్కూరులో 251, నంద్యాలలో 281, బనగానపల్లెలో 277, డోన్‌లో 291 మొత్తం 1621 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

నియోజకవర్గాల ప్రకారం ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	2023 జాబితా	2024 జాబితా	పెరుగుదల లేదా తగ్గుదల
ఆళ్లగడ్డ	226104	230914	పెరిగిన ఓటర్ల సంఖ్య 4810
శ్రీశైలం	193219	193962	పెరిగిన ఓటర్ల సంఖ్య 743
నందికొట్కూరు (ఎస్సీ)	210669	216559	పెరిగిన ఓటర్ల సంఖ్య 5890
నంద్యాల	259698	267645	పెరిగిన ఓటర్ల సంఖ్య 7947
బనగానపల్లె	239075	238900	తగ్గిన ఓటర్ల సంఖ్య 175
డోన్	222355	224111	పెరిగిన ఓటర్ల సంఖ్య 1756

మల్లన్న సన్నిధిలో పురందేశ్వరి



ఆలయ ప్రాంగణంలో పురందేశ్వరి

శ్రీశైలం, జనవరి 22: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సోమవారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకుచేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో పురందేశ్వరికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆమె శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ క్షేత్రాన్ని సందర్శించే భక్తులు శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించాలని భావితరాలకు శివాజీ దేశభక్తిని, కీర్తిని తెలియజేయాలన్నారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లలో అయోధ్యలో రామమందిరంలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమ వేడుకను భక్తులతో కలిసి వీక్షించారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంతిరెడ్డి అరవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

సీమ రేంజ్‌లో 24 మంది ఆర్ఎస్ఐలకు స్థానచలనం

కర్నూలు, జనవరి 22: రాయలసీమ రేంజ్ పరిధిలో 24 మంది ఆర్ఎస్ఐలను బదిలీ చేస్తూ డీఐజీ ఎస్.సెంథిల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కువ కాలం ఒకే జిల్లాలో పని చేసిన వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

ఆర్ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
మద్దప్ప	ఏఆర్, కర్నూలు	ఏఆర్, కడప
అహ్మద్ హుశేన్	ఏఆర్, కర్నూలు	ఏఆర్, తిరుపతి
ప్రదీప్ కుమార్	ఏఆర్, కర్నూలు	ఏఆర్, కడప
రమేష్	ఏఆర్, కర్నూలు	ఏఆర్, కడప
సద్దాం హుశేన్	ఏఆర్, కర్నూలు	ఏఆర్, కడప
రామమహేశ్వరరెడ్డి	ఏఆర్, కర్నూలు	ఏఆర్, తిరుపతి
అల్లాఉద్దీన్	ఏఆర్, నంద్యాల	ఏఆర్, కడప
సోమశేఖర్	ఏఆర్, నంద్యాల	ఏఆర్, అన్నమయ్య
వీరన్న	ఏఆర్, నంద్యాల	ఏఆర్, అన్నమయ్య
దాదాపీరయ్య	ఏఆర్, నంద్యాల	ఏఆర్, తిరుపతి
కాశీ చరణ్	ఏఆర్, నంద్యాల	ఏఆర్, అన్నమయ్య
కృష్ణమోహన్ రెడ్డి	ఏఆర్, నంద్యాల	ఏఆర్, తిరుపతి
బాబ్‌జాన్	ఏఆర్, కడప	ఏఆర్, కర్నూలు
పావని	ఏఆర్, కడప	ఏఆర్, కర్నూలు
అప్పలనాయుడు	ఏఆర్, కడప	ఏఆర్, కర్నూలు
వైడీ నాయుడు	ఏఆర్, కడప	ఏఆర్, కర్నూలు
మధుశంకర్	ఏఆర్, కడప	ఏఆర్, కర్నూలు
రామస్వామి రాజు	ఏఆర్, కడప	ఏఆర్, కర్నూలు
శ్రీనాథరావు	ఏఆర్, కడప	ఏఆర్, నంద్యాల
అమర్నాథ్ రెడ్డి	ఏఆర్, అన్నమయ్య,	ఏఆర్, నంద్యాల
ఏసీఎం వరమా	ఏఆర్, అన్నమయ్య	ఏఆర్, నంద్యాల
రవి	ఏఆర్, అన్నమయ్య	ఏఆర్, నంద్యాల
మురుగన్	ఏఆర్, అన్నమయ్య	ఏఆర్, నంద్యాల
రామ్మోహన్	ఏఆర్, చిత్తూరు	ఏఆర్, నంద్యాల

సెబ్‌లో బదిలీలు

కర్నూలు(అర్బన్), జనవరి 22: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు సీఐల బదిలీలు జరిగాయి. సోమవారం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఉత్తర్వులను జారీ చేశారు. ఆమేరకు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో బదిలీలు ఇలా జరిగాయి.

ఆర్ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్. విజయకుమార్	తాడిపత్రి	నంద్యాల
ఈ.నరసానాయుడు	అనంతపురం	కర్నూలు
ఎం. సత్యనారాయణ	కర్నూలు	తిరుమల
బీ. శ్యామ్ ప్రసాద్	కోడుమూరు	పీలేరు
పి. బార్గవరెడ్డి	మడకశిర	ఎమ్మిగనూరు
కే. జయంత్	తనకల్లు	డోన్
వీ. హరికృష్ణ	ఆదోని	చిత్తూరు
జీ. సుందర్	ఆలూరు	వాయల్పాడు
ఎం జయరామునాయుడు	ఎమ్మిగనూరు	మైదుకూరు
పి. రాజశేఖరగౌడ్	కర్నూలు డిటిఎఫ్	హిందూపురం
ఎం. మంజులా	కర్నూలు	బద్వేలు
జీ సృజన్‌బాబు	కోసిగి	కుప్పం
జి. బీమలింగం	డోన్	తిరుపతి
ఏ. రమేష్‌రెడ్డి	నందికొట్కూరు	మదనపల్లె
జీ. నాయుడు	ఆత్మకూరు	ముద్దనూరు
బీ. నాగమణి	నంద్యాల	ఎస్ఆర్ పేట్ సీపీ
జి. విశ్వనాథ్‌రెడ్డి	కడప	నంద్యాల
ఎస్, రామాంజనేయులు	పులివెందుల	కోడుమూరు
డబ్ల్యూ విన్నిలత	ఎల్ఆర్ పల్లె	ఆదోని
వై. జోగేంద్ర	చిత్తూరు	బనగానపల్లె
పి. వర్తనాదేవీ	నగరి	కోవెలకుంట్ల
బీ. సీతారామిరెడ్డి	పుంగనూరు	నందికొట్కూరు
ఎస్ఎం రఫి	నరహరిపేట	కర్నూలు ఐడబ్ల్యూ
ఎస్. మహబూబ్ బాష	కట్టిఫామ్ సీపి	కోసిగి
డి. సోమశేఖర్	స్టేట్ హెడ్‌క్వార్టర్	ఆలూరు
కేఆర్ రాజేంద్రప్రసాద్	స్టేట్ హెడ్‌క్వార్టర్	కర్నూలు

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా భరత్‌కుమార్



బీటి నాయుడిని కలిసిన భరత్ కుమార్

కర్నూలు(అర్బన్), జనవరి 22: టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడిగా భరత్‌కుమార్‌ని నియమిస్తూ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో ఇంజనీరింగ్ పూర్తి చేసి 2014 నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తూ తెలుగుదేశం పార్టీ తరఫున 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు వారి వార్డుల్లో మెజార్టీ తీసుకొచ్చేందుకు భరత్ కుమార్ కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్ చౌదరి, ధన, నవకాంత్, అశోక్ చౌదరి, రామ్ ప్రకాష్, నిఖిల్, రామాంజి, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలపై సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్) జనవరి 22 : జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలపై కలెక్టర్ జి.సృజన సంబంధిత అధికారులతో సోమవారం కాన్ఫరెన్స్‌హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను విధిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), జనవరి 22: వెల్దుర్తి మండలం బ్రహ్మగుండం బ్రహ్మేశ్వరస్వామి ఆలయానికి ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11 లోపు కుల ధృవీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు ఫొటోలు జత పరిచి సహాయ కమిషనర్ లేదా జిల్లా దేవదాయ శాఖాధికారి కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు చేయవచ్చని, లేదా నేరుగా ఇవ్వవచ్చని తెలిపారు

డిగ్రీలో ఇద్దరు డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 22: డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలోని 16 పరీక్షా కేంద్రాల్లో 5,479 మంది దరఖాస్తు చేసుకోగా 4,975 మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 22. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణరథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణరథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఊరేగించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

వైభవం.. శ్రీరామ పట్టాభిషేకం

- లలితా పీఠంలో సీతారాముల కల్యాణోత్సవం
- ఉత్సాహంగా సాగిన శోభాయాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం





శ్రీరామునికి పట్టాభిషేకం

కర్నూలు(కల్చరల్), జనవరి 22: 'సీతా రాముల కల్యాణం చూతము రారండి...'అంటూ ఆబాల గోపాలం అయోధ్య రాముడి కల్యాణ వేడుకలకు తరలి వచ్చారు. శ్రీరామ నవమి ముందే వచ్చినట్లుగా..శ్రీరామ నామ పారాయణంతో పులకించి పోయారు. అయోధ్యలోని శ్రీరామాలయంలో సోమవారం చేపట్టిన బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా కర్నూలు నగరంలో నిర్వహించిన 'అయోధ్య వేడుకలు' అంబరాన్నంటాయి. శ్రీ సీతారాముల కల్యాణోత్సవ సమితి ఆధ్వర్యంలో, బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, నగరంలోని వివిధ ధార్మిక సంస్థలు, దేవాలయాల కమిటీల ప్రతినిధులు సహకారంతో నిర్వహించిన ఈ వేడుకలు సందడి చేశాయి. పాతనగరంలోని శ్రీ లలితా పీఠంలో ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వందలాది భక్తులు కల్యాణ వేడుకలను తిలకిస్తుండగా, శ్రీ సీతా రామ ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. ఈ వేడుకల్లో శ్రీ సీతారాముల కల్యాణోత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఒకవైపు ఏడు ద్వారాలతో కూడిన 'అయోధ్య నమూనా ఆలయం' ఏర్పాటు చేసి శ్రీ సీతా రామ లక్ష్మణ సమేత ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో దశావతారాలతో కూడిన వివిధ రూపాలను భక్తులకై ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచీ సేకరించిన నదీజలాలలో ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీసీతా రామ లక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులను వేదికపై తీసుకువచ్చారు. ఉత్సవ మూర్తుల పల్లకీని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీడీపీ కర్నూలు నియోజక వర్గం ఇన్‌చార్జి టీజీ భరత్‌లతోపాటూ బీజేపీ, వీహెచ్‌పీ, కల్యాణోత్సవ కమిటీ నాయకులు మోస్తూ శ్రీరామ నినాదాలు చేశారు. అయోధ్య రాముడి పట్టాభిషేక మహోత్సవంలో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం త్రిదండి రామానుజ జీయర్ స్వామీజీ ధార్మిక ప్రవచన బోధన చేశారు. టీడీడీ పురాణ పండితుడు రామకృష్ణ శేషసాయిచే ఆధ్యాత్మిక బోధనల్లో శ్రీరాముని గొప్పదనాన్ని వర్ణించారు. అనంతరం శ్రీరాముల వారి పట్టాభిషేక మహోత్సవాన్ని శాస్త్ర పండితులు డాక్టర్ మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి బృందంచే వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు కగ్గోలు హరీష్‌బాబు, కేడీసీసీ బ్యాంకు చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి, కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి, శ్రీ సీతారామ కల్యాణోత్సవ సమితి ప్రతినిధులు కె. క్రిష్టన్న, డాక్టర్ మోక్షేశ్వరుడు, ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, నాగోజీరావు, నటేష్‌కుమార్, కల్కి మురళి, కే గోపీనాథ్, లక్ష్మయ్య తదితరులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అయోధ్య రామమందిర నిర్మాణానికి సహకరించిన దివంగత జి. పుల్లారెడ్డి తనయుడు ఏకాంబరేశ్వరరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. అలాగే 1990 దశకంలో అయోధ్యకు వెళ్లి కర సేవలు చేసిన 50 మంది నాటి కరసేవకులను వేదికపై సత్కరించారు. కర్నూలు నగరంలో జరిగిన ఈ వేడుకలను దివంగత జి. పుల్లారెడ్డికి అంకితం చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.





అకట్టుకున్న వేషధారణలు, హాజరైన భక్తులు

కోడుమూరులో నందీశ్వర ద్వారం ప్రారంభం

హాజరైన హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి

కోడుమూరు, జనవరి 22: పట్టణంలో లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం పునఃనిర్మాణంలో భాగంగా ఆలయ నందీశ్వర ఆలయ ముఖ ద్వారాన్ని సోమవారం హంపీ పీఠాధిపతుతి విద్యారణ్య భారతి స్వామిజీ ప్రారంభించారు. ముందుగా పాతబస్టాండ్ సమీపంలో ఉన్న సీతారాముల దేవాలయంలో హంపీ పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజల అనంతరం ఆయన పాదయాత్రగా లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి చేరుకున్నారు. ఈ పాదయాత్రలో కేంద్ర మాజీమంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు నిర్వాహకులు, అల్పాహారం, మధ్యాహ్నం అన్నసమర్పణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సర్పంచు భాగ్యరత్న, మాజీ సర్పంచ్ కేఈ రాంబాబు, సీబీలత, కోట్ల కౌశిక్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, డాక్టర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.





పాదయాత్రలో పాల్గొన్న కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, హంపి పీఠాధిపతి ఆశీస్సులు తీసుకుంటున్న కోట్ల హరిచక్రపాణి రెడ్డి

టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉద్రిక్తత

విచారణ పేరుతో సీఐ దుర్భాషలాడి దాడి చేశారని బాధితుల ఆరోపణ

నంద్యాల క్రైం, జనవరి 22 : నంద్యాల పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఓ కేసు విషయంలో టూ టౌన్ సీఐ రాజారెడ్డి స్టేషన్‌కు పిలిపించి దుర్భాషలాడి దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బాధితులు ఆందోళనకు దిగారు. నాలుగు రోజుల క్రితం డబ్బుల విషయంలో రెండు వర్గాలు ఘర్షణకు పాల్పడ్డాయి. ఈ ఘర్షణలో ఓ వర్గం వారు అధికార పార్టీ నాయకుల అండదండలతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి హుసేని, సుభాన్‌లపై కేసు నమోదు చేయించారు. అయితే వారు స్టేషన్ బెయిల్‌తో బయటకు వచ్చారు. సోమవారం విచారణ పేరుతో పోలీసులు స్టేషన్‌కు రమ్మని చెప్పడంతో బాధితులు వచ్చారు. సీఐ రాజారెడ్డి కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడడంతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, నంద్యాల మున్సిపల్ టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు ఎస్ఏ బాబుల్లా, ముస్లిం సంఘాల నాయకులు పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాధితుల పక్షాన నిలబడి వారికి మద్దతుగా నిలిచారు. డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీ మహేశ్వరరెడ్డికి జరిగిన ఘటనను వివరించారు. సీఐపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గొడవ జరిగిన విషయంపై స్టేషన్‌లో కేసు నమోదైందని, పూర్తి వివరాలు తెలుసుకుంటామని టీడీపీ, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులకు డీఎస్పీ నచ్చజెప్పారు.



నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులతో మాట్లాడుతున్న టీడీపీ, ముస్లిం సంఘాల నాయకులు

గుడిసె కృష్ణమ్మ ఇంట్లో స్కార్పియో దొంగతనం

మరో ఐదు ఇళ్లలోనూ చోరీ

ఆదోని, జనవరి 22 : టీడీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు గుడిసె కృష్ణమ్మ ఇంట్లో పార్క్ చేసిన స్కార్పియో వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి దొంగలించుకొని వెళ్లారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కార్పియో వాహనాన్ని దుండగులు వెనుక నుంచి మరో వాహనంతో తీసికెళ్లినట్లు తెలుస్తోంది. హౌసింగ్ బోర్డ్ కాలనీలో మూడో పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో గుడిసె కృష్ణమ్మ నివసిస్తున్నారు. దుండగులు మరో వాహనానికి చైన్ వేసి స్కార్పియోనుఉ లాక్కెళ్ళినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. గుడిసె క్రిష్ణమ్మ మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. అంతేకాక ఆస్పరి రహదారిలో వైపీఆర్ కాలనీలోని ఐదు ఇళ్లలో వరుసగా చోరీలు జరిగాయి. ఇందులో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇంట్లో చొరబడి రూ.4000 నగదుతో పాటు చిన్న పిల్లల నాలుగు బంగారు ఉంగరాలను దోచుకెళ్లారు. సెలవులు కావడంతో ఆ ఇండ్ల యజమానులు తాళాలు వేసి వేరే ఊర్లకు వెళ్లడం గమనించి దొంగతనాలు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

ఆస్పరి, జనవరి 22: అప్పుల బాధ తాళలేక మండలంలో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని తంగరడోణ గ్రామానికి చెందిన రైతు మునిస్వామి (46) సోమవారం సొంత పొలంలో ఉరివేసుకున్నాడు. రైతు మునిస్వామి తనకున్న నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. ఇందుకోసం వివిధచోట్ల రూ.7 లక్షల వరకు అప్పులు చేశాడు. పంటల దిగుబడి రాకపోవడంతో కనీసం పెట్టుబడి కూడా దక్కలేదు. ఈ క్రమంలో రుణదాతల నుంచి ఒత్తిళ్ల అధికం కావడంతో సొంతపొలంలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య రాధమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు నరసప్ప, రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విధుల్లోకి1450 మంది అంగన్‌వాడీలు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 22: జిల్లాలో సోమవారం 1450 మంది అంగన్‌వాడీలు విధులకు హాజరయ్యారని ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి తెలిపారు. 1,886 అంగన్ వాడీ కేంద్రాలలో 1,866 మంది టీచర్లు, 1,777 హెల్పర్లు పనిచేస్తున్నారన్నారు. 2,200 మంది అంగన్‌వాడీలకు విధుల తొలగింపు ఉతర్వులను పోస్టు ద్వారా పంపిస్తున్నామని తెలిపారు. మరో వైపు అంగన్‌వాడీలకు మద్దతుగా ఈ నెల 24న రాష్ట్ర బంద్‌కు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎన్టీయూసీ, ఐఎన్‌టీయూసీ పిలుపునిచ్చాయి.

3న జిల్లా పరిషత్ స్థాయిసంఘాల సమావేశాలు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 22:జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసారని ఆయన తెలిపారు ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11 నుండి 12 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12 గంటల నుండి 1 గంట వరకు 5వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు 4వస్థాయి సంఘం, 2.30 గంటల నుండి 3.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, 3.30 గంటల నుండి 4.30గంటల వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

మంత్రాలయంలో 59 అడుగుల రామయ్య

ఏకశిల విగ్రహాన్ని ఆవిష్కరించిన పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 22: రాఘవరాయుని చెంత 59 అడుగుల ఏకశిల శ్రీరాముడి విగ్రహాన్ని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆవిష్కరించారు. భారీగా తరలివచ్చిన భక్తుల నడుమ పీఠాధిపతి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాముడి ఏకశిల విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మాట్లాడుతూ మంత్రాలయాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా మారుస్తామన్నారు. శ్రీరాముని అరణ్యవాసం సమయాల్లో మంత్రాలయం ప్రాంతంలో నడయాడిన ప్రదేశంలో శ్రీరాముని ఏకశిల విగ్రహం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా భారీ విగ్రహానికి సహకరించిన దాతలు, శిల్పులకు పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



59 అడుగుల శ్రీరాముని విగ్రహం వద్ద అభివాదం చేస్తున్న పీఠాధిపతి

బియ్యపు గింజపై ప్రధాని మోదీ చిత్రం

ఎమ్మిగనూరు, జనవరి 22: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు బారికి చంద్రశేఖర్ దేశప్రధాని నరేంద్ర మోదీ చిత్రాన్ని చిత్రీకరించి తన ప్రతిభను కనబరిచాడు. రామజన్మభూమి అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ వేళ దేశప్రధాని నరేంద్ర మోదీ కాషాయం జండా పట్టుకొని ఉన్న చిత్రాన్ని బియ్యపు గింజపై చిత్రీకరించి పలువురి ప్రశంసలు పొందాడు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అంతా రామమయం



బండిఆత్మకూరు పెద్దదేవళాపురం గ్రామోత్సవంలో భక్తులు



ఆత్మకూరులో శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నేత మోమిన్ షబాన

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సీతారాముల నామస్మరణ మారుమోగింది. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీతారాముల విగ్రహాల శోభాయాత్రలు, గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి. అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెలుగోడు పట్టణంలోని లక్ష్మి ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యలో జరిగే కార్యక్రమాన్ని వీక్షించేందుకు అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. ఆత్మకూరులో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఉత్సవమూర్తులను అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి అమ్మవారిశాల వరకు బైక్ ర్యాలీ సాగింది. పలు ఏరియాల్లో రామభక్తులకు బెల్లం పానకం, వడపప్పు పంపిణీ చేశారు. రథానికి గుమ్మడికాయలు, 108 టెంకాయలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వాసవీ కల్యాణ మంటపంలో భారీ ఎల్ఈడీ స్ర్కీన్లపై అయోధ్య కార్యక్రమాన్ని తిలకించారు. ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం, బాపనంతాపురం,కృష్ణాపురం,శ్రీపతిరావుపేట, సిద్ధపల్లి, ఇందిరేశ్వరం, వడ్లరామాపురం, కొత్తరామాపురం, కరివేన తదితర గ్రామాల్లోని రామాలయాల్లో కల్యాణ వేడుకలు కమనీయంగా సాగాయి. గడివేముల మండలంలోని బూజనూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి దంపతులు సీతారాముల విగ్రహాలకు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. బండిఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల్లో రాముల, ఆంజనేయ, చెన్నకేశవ, జనార్దన, కృష్ణుని ప్రత్యేక పూజలు చేశారు. రాముల, హనుమాన్ జెండాలు చేతబట్టి జైశ్రీరామ్ అంటూ రామనామస్మరణ మార్మోగించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. పాములపాడులోని బ్రహ్మంగారి ఆశ్రమంలో భక్తులకు ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేసి అయోధ్య కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. అనంతరం విశ్వహిందుపరిషత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపల్లి మండలం భావాపురం, పెద్దగుమ్మడాపురం, ఎదురుపాడు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్ల ఎదుట ముత్యాల ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. రామభక్తులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. పాణ్యంలోని దొంగు సమీపంలో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. కొనిదేడులో రామాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్ర్కీన్‌ను ఏర్పాటు చేసి అయోధ్య కార్యక్రమాన్ని తిలకించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్



పాములపాడులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పాణ్యంలో ఎల్ఈడీ స్ర్కీన్లపై అయోధ్య కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు



నంద్యాలలోని రామాలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



నంద్యాలలో బలరాముడి విగ్రహప్రాణప్రతిష్ఠను తిలకిస్తున్న అభిరుచి మధు, నిర్వాహకులు





వెలుగోడులో ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గడివేముల బూజనూరులో అన్నదానం చేస్తున్న సీనియర్ టీడీపీ నాయకుడు పంట రామచంద్రారెడ్డి

బీజేపీలో చేరిన వడ్డెర కుటుంబాలు

నంద్యాల (కల్చరల్), జనవరి 22: నంద్యాల పట్టణంలోని వివిధ వార్డుల్లో ఉన్న వడ్డెర కుటుంబాలు సోమవారం బీజేపీ చేరినట్లు నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు తెలిపారు. బీజేపీ కార్యాలయంలో నంద్యాల అధ్యక్షుడు కొట్టి చంద్రశేఖర్, అభిరుచి మధు ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు చల్లా మద్దులేటి నేతృత్వంలో 50 కుటుంబాలు పార్టీలో చేరాయి. అభిరుచి మధు మాట్లాడుతూ బీజేపీ అమలు చేస్తున్న పథకాలు పేదలకు ఎంతో ఉపయోగం అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గంగాధర్, లక్ష్మీరెడ్డి, కృష్ణారెడ్డి, వడ్డెర సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, పుల్లయ్య నాగరాజు, కృష్ణ, కటారి కృష్ణ తదితరలు పాల్గొన్నారు.

అద్దె గదులకు బహిరంగ వేలం

నంద్యాల (కల్చరల్), జనవరి 22: స్థానిక కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలోని గదులను బాడుగకు బహిరంగ వేలం ఈ నెల 25 న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ. 5వేలు డిపాజిట్ కట్టి వేలం పాటలో పాల్గొనాలని ఈవో తెలిపారు. మూడేళ్ల బాడుగ కోసం దేవదాయ శాఖ అధికారుల సముఖంలో దేవాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. వివరాల కోసం ఆలయ ఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ

శ్రీశైలం, జనవరి 22: శ్రీశైల క్షేత్రంలో సోమవారాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ చేసి వెండి రథంపై ఆశీనులనుజేసి రథోత్సవాన్ని నిర్వహించారు.

అలరించిన నిత్య కళారాధన : శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా కూచిపూడి నృత్య అకాడమీ, హైదరాబాద్ బృందం సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించింది. షణ్ముఖి, సాహితి, ప్రవలిక, దివ్య, ప్రసన్నరాణి, భావన తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

క్రికెట్ ట్రోఫీ ఎస్పీ లెవెన్ జట్టు కైవసం



ట్రోఫీని ఎస్పీ జట్టుకు అందజేస్తున్న కలెక్టరు

పాణ్యం, జనవరి 22 : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్రికెట్ పోటీలలో క్రికెట్ ట్రోఫీని 58 పరుగుల తేడాతో ఎస్పీ లెవెన్ జట్టు కైవసం చేసుకుంది. ఈ పోటీలో కలెక్టర్ లెవెన్ జట్టుకు కలెక్టరు మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ లెవెన్ జట్టుకు ఎస్పీ రఘువీర్ రెడ్డి కెప్టెన్‌లుగా వ్యవహరించారు. మొదట బ్యాటింగ్‌ను ఎంచుకున్న ఎస్పీ జట్టు 15 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేయగా, కలెక్టరు జట్టు మూడు వికెట్లు కోల్పోయి 94 పరుగులు చేసి రన్నర్‌గా నిలిచింది. దీంతో విన్నర్ గానిలిచిన ఎస్పీ లెవెన్ జట్టు జిల్లా స్థాయి క్రికెట్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎస్పీ జట్టు ఆటగాడు హర్షవర్ధన్ మ్యాన్ ఆఫ్ దమ్యాచ్‌కు ఎంపికకాగా ఉత్తమ బౌలర్‌గా కలెక్టరు టీం ఆటగాడు అప్సర్ ఎంపికనట్లు కలెక్టరు తెలిపారు. ట్రోఫీని జిల్లా కలెక్టరు చేతుల మీదుగా ఎస్పీ జట్టుకు అందజేశారు. అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఆర్డీఓ శ్రీనివాసులు, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప చెట్ల మధ్య పాఠశాల

- ఇబ్బందుల్లో విద్యార్థులు



కంప చెట్ల మధ్య పాఠశాల

పాణ్యం, జనవరి 22 : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల కంపచెట్ల మధ్య కొనసాగుతోంది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల గదుల కిటికీలలోకి కంపచెట్లు చొచ్చుకొని వచ్చి తరగతుల నిర్వహణకు ఆటంకంగా మారాయి. పాఠశాలలో స్వీపరు లేకపోవడంతో ఈ ప్రాంతమంతా చెత్త చెదారంతో అపరిశుభ్రంగా తయారైంది. మధ్యాహ్న భోజన సమయంలో నేలపై మట్టిలో కూర్చొని తినాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడునేడు పనులతో పాఠశాల గదులు మరమ్మతులు చేశారేగాని డైనింగ్ హాల్ నిర్మించలేదని ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి.

పాఠశాలకు స్వీపర్‌ను ఏర్పాటు చేయాలి : పాఠశాలకు స్వీపర్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్ డిమాండ్ చేశారు. పాణ్యం ప్రభుత్వ పాఠశాలలోని స్వీపర్ పదవీ విరమణ చేయడంతో ఖాళీగా ఏర్పడిన స్వీపర్ పోస్టును వెంటనే బర్తీ చేయాలని కోరారు. పరిశుభ్రతను నేర్చుకునే విద్యార్థులు చెత్తలోనే పాఠాలు నేర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పాఠశాలకు వాచ్‌మెన్, స్వీపర్ లేరన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ నాయకులతో కలెక్టర్ సమీక్ష

నంద్యాల (కల్చరల్), జనవరి 22: పారదర్శకమైన తుది ఓటర్ల జాబితాను రూపొందించామని కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో తుది ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి జాబితా ప్రతులను జేసీ రాహుల్‌కుమార్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచించిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామని వివరించారు. సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ రియాజ్‌బాషా, తెలుగుదేశం నాయకుడు రమణారెడ్డి, శివరామిరెడ్డి, వైయస్సార్‌సీపీ నాయకుడు అనీల్ అమృతరాజ్, బీజేపీ నాయకుడు ఉపేంద్రనాథ్ రెడ్డి, సీపీఐ, మార్కిస్టు పార్టీ తరపున నరసింహులు, బీఎస్పీ తరుపున శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీపార్టీ నాయకులు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడ అరెస్టులు

- చలో విజయవాడకు వెళ్లకుండా అంగన్‌వాడీల నిర్బంధం

నంద్యాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వేతనాల పెంపుపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో దాదాపు 41 రోజులుగా ధర్నా చేస్తున్న అంగన్వాడీలు సోమవారం 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చారు. ఇందులో పాల్గొనేందుకు బయలుదేరిన అంగన్వాడీలను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. నంద్యాల నుంచి విజయవాడకు బయలుదేరిన అంగన్వాడీలను ఆదివారం రాత్రి పోలీసులు రైల్వే స్టేషనులో అదుపులోనికి తీసుకున్నారు. మహానందిలో అంగన్వాడీలను అదుపులోనికి తీసుకున్నారు. అలాగే చాగలమర్రిలో అంగన్వాడీలను విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అంగన్వాడీలకు మద్దతుగా డోన్‌లో రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషనుకు తరలించారు. అలాగే ఆయా మండలాల్లో అంగన్వాడీలను అదుపులోనికి తీసుకున్న పోలీసులు వారిని విజయవాడ వెళ్లకుండా అడ్డుకున్నారు.



మహానంది పోలీసుల అదుపులో అంగన్‌వాడీ వర్కర్లు



ఆత్మకూరులో రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నంద్యాల సెబ్ అధికారుల బదిలీ

నంద్యాల క్రైం, జనవరి 22 : రాష్ట్ర వ్యాప్తంగా సెబ్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా కేంద్రంలోని సెబ్ సీఐ, ఎస్సైలు బదిలీ అయ్యారు. నంద్యాలలోని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.నాగమణి ఎస్ఆర్ పేట సీపీకి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కడప సెబ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.విశ్వనాథరెడ్డి నంద్యాలకు రానున్నారు. అలాగే నంద్యాల సెబ్ ఎస్సై శ్రీలక్ష్మి ఐ.డబ్ల్యు.అనంతపురం డివిజన్‌కు, డీటీఎఫ్ సెబ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ నాయక్ అనంతపురం జిల్లా ఉరవకొండ సెబ్ స్టేషన్‌కు బదిలీ అయినట్లు సెబ్ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తపల్లి, జనవరి 22: మండలంలోని చదువుల క్షేత్రం కొలనుభారతిలో గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగశేషన్నగౌడు, నంద్యాల జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు ఖాజన్నగౌడు ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. గౌడ కులస్థులకు ప్రభుత్వం ఈత వనాలు పెంచుకునేందుకు ప్రతి మండలంలో కనీసం 15 ఎకరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 50 సంవత్సరాలు పైబడిన కుటుంబ పెద్దకు పెన్షన్ మంజూరు చేయాలని, జనాభా ప్రాతిపదికన టీఎఫ్‌టీలను ఇవ్వాలని కోరారు. ఈడిగ (గౌడ) సంఘం బలోపేతానికి ఐకమత్యంతో ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల బీజేపీ కన్వీనర్ శంకర్‌గౌడు, భాస్కర్‌గౌడు, చంద్రశేఖర్ గౌడు, ఎర్రం శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుడా.. మజాకా?

ప్రభుత్వ భూములను కొల్లగొట్టి మట్టి తరలింపు



ట్రాక్టర్‌లో ఎర్రమట్టి తరలిస్తున్న దృశ్యం

మహానంది, జనవరి 22: నల్లమల అటవీ సమీపం నుంచి ఎర్రమట్టి పట్టపగలే అక్రమంగా తరలిపోతోంది. అధికారపార్టీ నేత అండదండలతో అక్రమార్కులు టిప్పర్లు, ట్రాక్టర్ల సహాయంతో ఎర్రమట్టిని హద్దులు దాటిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు. మహానంది మండలం గాజులపల్లి సమీపంలోని బసవాపురం సరిహద్దులోని ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిని ఒక గ్రామ వీఆర్ఏ కుమారుడు సొంతం చేసుకొని అధికారపార్టీ నాయకుని అండతో ఎక్స్‌కవేటర్ సాయంతో యథేచ్ఛగా మట్టిని తవ్వి తరలిస్తున్నాడు. సోమవారం టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పట్టపగలే ఎర్రమట్టిని రవాణా చేస్తున్నా అధికారులు మిన్నకుండడం అనుమానాలకు తావిస్తోంది. గాజులపల్లి రద్దీ ప్రాంతం కావడంతో వాహనాల ద్వారా పట్ట పగలే ఎర్రమట్టిని తరలిస్తున్నారు. వాహనాలు అతి వేగంగా వెళ్తుండడంతో గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిని అడగాలని నిలదీస్తున్నారు. మట్టి అక్రమ తరలింపుపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

నంద్యాల క్రైం, జనవరి 22 : నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో ఓ యువకుడు మద్యం సేవించి హల్‌చల్ చేశాడు. సోమవారం మద్యం సేవించిన యువకుడు చేతిలో కర్ర పట్టుకొని గట్టిగా కేకలు వేస్తూ అటుగా వెళ్తున్న ప్రజలపై దాడికి ప్రయత్నిస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. ఓ టైలర్ షాప్‌లో ఉన్న ఆచారి అనే వ్యక్తిపై కర్రతో దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. స్పృహ కోల్పోయి పడిపోయినట్లు నటించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ యువకుడిని లేపే ప్రయత్నం చేశారు. పోలీసులు రావడంతో ఒక్కసారిగా లేచి మళ్లీ స్థానికులపై కేకలు వేశాడు. పోలీసుల ముందు మతిస్థిమితంలేని వ్యక్తిగా ప్రవర్తించాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పాటుపడాలి : డీటీవో

నంద్యాల క్రైం, జనవరి 22 : రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని రవాణా శాఖ జిల్లా అధికారి శివారెడ్డి పిలుపునిచ్చారు. జాయతీ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రత నియమ, నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించి ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను డ్రైవ్ చేస్తే ప్రమాదాలకు గురవుతారని హెచ్చరించారు. ప్రమాదాలతో కుటుంబపెద్ద మరణిస్తే ఆ కుటుంబం పడే వేదన గురించి ఆలోచించాలని ఆయన గుర్తు చేశారు. ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించి రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలను కొంతవరకైనా నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీకాంత్, రవిశంకర్‌నాయక్, జీటీనాయుడు, సుబ్బయ్య, ఏవో కురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

జయహో టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నందికొట్కూరు, జనవరి 22: టీడీపీ చేపట్టిన జయహో బీసీ కార్యక్రమాలు నియోజకవర్గంలో ఈ నెల 25 నుంచి 29 వరకు జరుగుతాయని, విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు దేవెళ్ల మురళీ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. నాయకులు జయసూర్య, రఘురామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, షకీల్‌అహ్మద్, మహేశ్వరెడ్డి, ముర్తుజావలి, శ్రీను, మద్దిలేటి పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ

జూపాడుబంగ్లా, జనవరి 22: మండలంలోని పారుమంచాల గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జయసూర్య పాల్గొని మాట్లాడారు. బాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుడి ఎంపిక



క్రీడాకారుడిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రుద్రవరం, జనవరి 22 : రుద్రవరం ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారుడు శ్రీనివాసులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు సుబ్బరాయుడు, పీడీ షేక్షావలి సోమవారం తెలిపారు. నంద్యాల జిల్లాలోని మెల్వూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ 14 విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

పకడ్బందీగా కుల గణన సర్వే చేయండి

రుద్రవరం, జనవరి 22 : పకడ్బందీగా కులగణన సర్వే చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆర్.నాగలవరం, టి.లింగందిన్నె, రుద్రవరం గ్రామాల్లో కులగణన సర్వే గ్రామ వలంటీర్లు చేశారు. కులగణన సర్వేను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ఓబులేసు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

చాగలమర్రి, జనవరి 22: మండలంలోని మల్లేవేముల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయా శాఖల అధికారుల సమక్షంలో సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఈదుల సరోజమ్మ, ఏవో రంగనేతాజీ ఆధ్వర్యంలో వివిధ పథకాలపై ప్రజలకు వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో పేర్కొన్నారు. వివిధ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోస్టల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

శిరివెళ్ల, జనవరి 22 : గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీవో కేవీ సుబ్రహ్మణ్యం సూచించారు. శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్ రెడ్డితో ఆయన సోమవారం సమావేశమయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్ష-2లో భాగంగా శిరివెళ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించనున్న వైద్య శిబిరంపై సమావేశంలో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



లోగోను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

డోన్(రూరల్), జనవరి 22: డోన్ మండలంలోని చిన్నమల్కాపురం గ్రామ రైల్వేస్టేషన్ రోడ్డు సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి ప్రభాకర్ హాజరయ్యారు. ఆయన పాఠశాలకు తమ వంతుగా విద్యార్థులు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలతో సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దల రాజ్‌కుమార్, చిన్నమల్కాపురం పూర్వ విద్యార్థులు, గ్రామ నాయకులు, పెద్ద తిమ్మయ్య, చిన్న తిమ్మయ్య, బద్దల నాగరాజు, రాజేశ్వరరెడ్డి, సత్యనారాయణ శెట్టి, గార్లపాటి మద్దిలేటి, మద్దయ్య, నాటి ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, నరసప్ప పాల్గొన్నారు.

సమష్టిగా పోరాడాలి

డోన్(రూరల్), జనవరి 22: మాదాసి, మాదారి కురువలు తమ హక్కుల సాధన కోసం సమష్టిగా పోరాడాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి కేసీ మద్దిలేటి, గౌరవ సలహాదారులు హోటల్ రంగన్న, తాడూరు రంగనాథమయ్య, మల్లికార్జున అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్తబస్టాండు వద్ద మాదాసి, మాదారి కురువ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మాదాసి మాదారి కురువలను రాజ్యాంగంలో ఎస్సీలుగా గుర్తిస్తున్నప్పటికీ రెవెన్యూ ఉద్యోగులు బీసీలుగా గుర్తిస్తూ బీసీ ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ ధ్రువపత్రాల కోసం మాదాసి, మాదారి కురువలు సంయుక్తంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో డోన్ సంఘం నాయకులు ప్రసాద్, బత్తిన మునిస్వామి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి, జనవరి 22: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతనాయక్ సూచించారు. సోమవారం చాగలమర్రిలోని టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలించారు. రహదారిపై వెళ్తున్న వాహనాలను తనిఖీ చేశారు. అక్రమంగా మద్యం, నగదు తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

బనగానపల్లె, జనవరి 22: భూమి లేని నిరుపేదలైన దళితులకు ప్రభుత్వం భూమి కొనుగోలు ఇచ్చే వాటిలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు, బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం సీనియర్ అసిస్టెంటుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. మండలంలోని బంబులదిన్నె, కైప, ఇల్లూరు కొత్తపేట గ్రామాల్లో భూమి లేని దళితులకు భూమి కొనుగోలు పథకం కింద 39మంది మహిళలకు భూములు ఇప్పిస్తామని దుర్గానాగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మొదుళ్లమహేశ్వర్‌రెడ్డి అనే ముగ్గురు ఒకొక్కరి నుంచి రూ.25వేలు వసూలు చేశారని ఆరోపించారు. డబ్బులు తీసుకొని నిరుపేదలైన పేద ఎస్సీ మహిళలకు భూములు ఇప్పించలేదన్నారు. ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.2.45 కోట్లను ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, బనగానపల్లె మండల తహసీల్దారు అధికారులు, దళారులైన ముగ్గురు దోచుకున్నారని ఆరోపించారు.

జై శ్రీరామ్





● ఆలయాల్లో పండుగ వాతావరణం ● బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా పూజలు, గ్రామోత్సవాలు

బనగానపల్లె, జనవరి 22: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలు సోమవారం రామనామంతో మారుమోగాయి. బనగానపల్లె పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బోయపేటలోని రామాలయం, అయ్యప్పస్వామి ఆలయం, మంళవారంపేట రామాలయం, నాయిబ్రాహ్మణ కాలనీలోని రామాలయంలో, యనకండ్ల, పాతపాడు, జోలాపురం, యాగంటిపల్లె రామాలయంలో, బీరవోలు, రామతీర్థం, పలుకూరు, కైప తదితర గ్రామాల్లో వివిధ దేవాలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, కామినేనిపల్లె తదితర అన్ని గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్రగుంట్లలోని రామాలయంలో అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను తిలకించేందుకు ఎల్ఎఈడీ తెరను ఏర్పాటు చేశారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో సోమవారం జై శ్రీరామ్ అంటూ భక్తులు తన భక్తిని చాటుకున్నారు. ఆంజనేయ, శ్రీరామ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రుద్రవరం, చిలకలూరు, బి.నాగిరెడ్డిపల్లె, తువ్వపల్లె, గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ప్యాపిలి: అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని మండలంలోని గ్రామ గ్రామాన సీతారాముల వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు.

చాగలమర్రి: అయోధ్య మందిరంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం చాగలమర్రి గ్రామంలోని ఆయా దేవాలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. హిందూ సంఘం ఎస్ఎస్ఎఫ్ సభ్యుల ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నరసింహస్వామి మాలదారులు అయోధ్య రాముడి పతాకాలు చేతపట్టి పలు ఆలయాల వద్దకు వెళ్లి పూజలు చేశారు. బసవన్న కట్ట, పెద్ద మకానం, మల్లెంవారి వీధి, పట్టాభిరామ, కోదండరామాలయాలతో పాటు కొత్తపల్లె, చింతలచెరువు, గొట్లూరు, గ్రామాల్లో అయోధ్య రాముడి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉయ్యాలవాడలో అర్చకుడు మోహనకృష్ణ, ఆర్.జంబులదిన్నెలో కీర్తిలక్ష్మణస్వామి స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక అలంకరించారు.

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం శ్రీసీతారాముల కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం అహోబిలంలో సీతారాముల కల్యాణాన్ని చేపట్టినట్లు అర్చకులు వివరించారు. గ్రామాల్లోని శ్రీరాముల దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బేతంచెర్ల: అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ శుభసందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం బేతంచెర్ల పట్టణంలో రామభక్త మండలి ఆధ్వర్యంలో శోభాయాత్ర చేశారు. యాత్రలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అమ్మవారిశాలలో ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో గౌరి హుశేన్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, పుల్లారెడ్డి గ్రూపు దేవాలయాల ధర్మకర్తల మండలి చైర్మన్ గుండా మోహన్‌రావు, బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, నాగమోహన్, బాలేశ్వరరెడ్డి, వీరారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, వెంకటరమణ, అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలోని ఎరుకలిపేటలోని రాముని దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరికిశోర్, మహేశ్, జయచంద్ర, జయశేఖర్, మహేశ్, రాముడు, శ్రీనివాసులు, శివ తదితరులు పాల్గొన్నారు. గాంధీనగర్‌లోని శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణ కార్యక్రమాలు కరసేవకులైన నాగిరెడ్డి కేశవరెడ్డి, నీలకంఠం, చెర్రి మురళీధర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, అరికట్ల రాములమ్మ, రామిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని శ్రీరాముని ఆలయాల్లో నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో సంబరాలు సోమవారం నిర్వహించారు. అవుకులోని కొండ మీది వీధిలో వెలసిన శ్రీరామ ఆలయంతో పాటు, గంగపుత్రుల కాలనీ, మార్కెట్ వీధి, అమ్మవారిశాల వీధుల్లో వెలసిన శ్రీరాముని ఆలయాల్లో అర్చకులు స్వాముల వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అవుకులో శ్రీచెన్నకేశవస్వామి భక్తబృందం శ్రీరాముని చిత్రపటాన్ని ట్రాక్టర్లలో ఊరేగించారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు, డబ్ల్యూకొత్తపల్లె, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగర్, భాగ్యనగరం తదితర గ్రామాల్లో భక్తులు, ప్రజలు జైశ్రీరామ్ అంటూ నామస్మరణ చేశారు. అనంతరం గ్రామాల్లో ఉత్సవమూర్తులు సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించారు.

సంజామల : మండలంలోని అన్ని గ్రామాల్లోని శ్రీరాముని ఆలయాల్లో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంజామలలో విశ్వహిందూ పరిషత్ నాయకులు బండారు రామకృష్ణుడు, చల్లా మోహన్, రఘురామయ్య, లక్ష్మన్న, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఓబుళరెడ్డి, చల్లాకృష్ణమూర్తి, వెంకటరామయ్యల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.



చాగలమర్రిలో చీర, సారెతో సీతారాములకు పూజలు చేస్తున్న మహిళలు



శిరివెళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



రుద్రవరంలో శ్రీరాముడు, అంజనేయ విగ్రహాలకు గ్రామోత్సవం చేస్తున్న దృశ్యం



సంజామలలో భజన చేస్తున్న భక్తులు




చాగలమర్రిలో దీపోత్సవం

ప్యాపిలిలో...





అవుకులో ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆళ్లగడ్డ: అహోబిలంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఉయ్యాలవాడ: మాయలూరులో గ్రామోత్సవం



దొర్నిపాడు: డబ్ల్యూ.కొత్తపల్లెలో జైశ్రీరామ్ నినాదాలు చేస్తున్న ప్రజలు



బనగానపల్లె అంజనేయస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

గొర్రెల పెంపకందారులను మంత్రి అవమానిస్తారా?

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్



డోన్‌లో మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

డోన్, జనవరి 22: ప్రొటోకాల్ పాటించకుండా గొర్రెల పెంపకందారులను మంత్రి బుగ్గన అవమానించడం ఏమిటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని తన స్వగృహంలో వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ మండలంలోని హుశేనాపురం గ్రామంలో మంత్రి బుగ్గన గొర్రెల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారని.. కనీస ప్రొటోకాల్ పాటించకపోవడం చాలా దారుణమన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 420 గొర్రెల పెంపకందారుల సొసైటీలు ఉన్నప్పటికీ ఎవరిని కూడా పిలవకుండా మంత్రితో పాటు అధికారులు అవమానించారని ధ్వజమెత్తారు. రెండో విడత ఎన్‌సీడీసీ రుణాలు రూ.100 కోట్ల వరకు ఇవ్వాలని, మంత్రి బుగ్గన విడుదల చేయకుండా గొర్రెల సొసైటీలకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్ డైరెక్టర్లు రంగనాథం, గువ్వలకుంట్ల లక్ష్మన్న, టీడీపీ నాయకులు గురుస్వామి యాదవ్, సి.నాగేశ్వరరావు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

ప్యాపిలి: సీఎం జగన్ బీసీల ద్రోహి అని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై.నాగేశ్వరరావుయాదవ్ విమర్శించారు. సోమవారం పట్టణంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, యువనాయకులు ధర్మవరం గౌతంరెడ్డి, గిరిధర్‌యాదవ్, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు తిరుపాలుబాబు, శ్రీరాములు, చల్లా వీరాంజనేయులు, రామ్మోహన్‌యాదవ్, చిన్నసుంకయ్య, గండికోట రామసుబ్బయ్య, నాగేంద్ర, చల్లా అనుదీప్, గండికోట పెద్దరామాంజనేయులు, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కక్షతో రాజకీయాలు చేస్తున్న వైసీపీ

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



యల్లావత్తులలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

రుద్రవరం, జనవరి 22 : రాష్ట్రంలో వైసీపీ నాయకులు కక్షతో రాజకీయలు చేస్తున్నారని మాజీమంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. సోమవారం రాత్రి మండలంలోని యల్లావత్తుల గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అనే పేరుతో రాష్ట్రాన్ని గద్దెనెక్కి అప్పులపాలు చేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగిపోయి రక్షణ లేకుండా పోయిందన్నారు. టీడీపీకి ఒక్క అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమోహన్, పెద్దపుల్లారెడ్డి, బీసీ సెల్ తాలుకా ఉపాధ్యక్షుడు శ్రీనువాసులు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, బంగారు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

సంజామల, జనవరి 22: సంజామలలో మంగళవారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో జయహో టీడీపీ బీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ ఇంచార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్కిహుస్సేన్ సోమవారం తెలిపారు. నియోజకవర్గం బీసీ సెల్ కమిటీ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ బీసీ క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, మండల పరిధిలోని బీసీ నాయకులు, టీడీపీ నాయకరులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ఘనంగా పల్లకి సేవ ఉత్సవం

బనగానపల్లె, జనవరి 22: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకిలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు పల్లకిసేవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.